మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

# వందేళ్ళకు అనుగుణంగా భూభారతి

- రైతుల యొక్క భూ సమస్యలు తీర్చే చట్టం ● ప్రజల అభిప్రాయాల మేరకే రూపకల్పన
- పేదల కన్నీరు తుడిచే, భద్రత కల్పించే ప్రభుత్వమే ఇందిరమ్మ రాజ్యం ● ఆధార్ మాదిరిగానే భూధార్
- నాగర్‌కర్నూల్ అవగాహన సదస్సులో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ధరణితో రైతులు నరకం : మంత్రి జూపల్లి కృష్ణారావు
- పాల్గొన్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి, మెఘారెడ్డి

**నాగర్ కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** వందేళ్ళకు అనుగుణంగా రూపొందించిన చట్టం భూ భారతి చట్టమని, అవసరమైతే ప్రజలు సూచించిన అంశాలను సవరణ ద్వారా చట్టంలో చేరుస్తామని రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతుల కన్నీటిని తుడవటానికి తీసుకొచ్చిన చట్టమే భూభారతి అని స్పష్టం చేశారు. జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఒక చట్టం రూపొందిస్తే ఆ చట్టం పేదవాడికి చుట్టంలాగా ఉండాలని, ఆధార్ లాగే భూధార్ నెంబర్ త్వరలో ఇవ్వబోతున్నామని భూ భారతి చట్టం అందరికీ ఉపయోగపడేలా రూపొందించడం జరిగిందనీ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సమీకృతజిల్లా కార్యాలయాల సముదాయానికి హెలికాప్టర్ ద్వారా చేరుకోగా హెలిపాడ్ దగ్గర పార్లమెంట్ సభ్యులు మల్లురవి, రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం నాగర్‌కర్నూల్ మండల పరిధిలో గల గగ్గలపల్లి గ్రామంలోని ఫంక్షన్‌హాల్ లో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం 2025పై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏదైనా చట్టం చేస్తే వందేళ్ళకు సరిపడే విధంగాచట్టం చేయాలని సూచించారు. భూభారతి చట్టం వందేళ్లకు సరిపడా విధంగా ఉందన్నారు. అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామన్న మాటను నిలబెట్టుకున్నామని, ధరణి పోర్టల్ ద్వారా ఎదుర్కొన్న భూ సమస్యలను భూభారతి చట్టం ద్వారా తీర్చనున్నట్లు తెలియజేశారు. నాలుగు గోడలమధ్య చుట్టాల కొరకు రూపొందించిన ధరణి చట్టాన్ని రూపుమాపి రాష్ట్ర ప్రజలందరి భూ సమస్యలు తీర్చే భూభారతి చట్టంగా ప్రజల కొరకు తీసుకొచ్చామని వివరిం చారు. ఏదైనా చట్టం చేస్తే వందేళ్ళకు సరిపడే విధంగా చట్టం చేయాలని సూచించారు. గతంలో ధరణి వల్ల ఎంత ఇబ్బంది కలిగిందో రైతులకు తెలుసని దానిని దృష్టిలో ఉంచుకొని భూభారతి కొత్త చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు.2020 ధరణి చట్టంలో సాదాబైనామా అనే అంశాన్ని గత ప్రభుత్వం తొలగించిందనీ అన్నారు. గతంలో రైతులు సాదాబైనామ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులలో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. రైతుల కన్నీటిని తీర్చేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తామన్నారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగారని ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ధరణిలో ఏదైనా సమస్య పరిష్కారం కోసం దరఖాస్తు చేస్తే వెయ్యి రూపాయలు ఇవ్వాల్సి ఉండేదని, ఇప్పుడు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. మే 1 నుండి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. రైతులకు భూభారతి చట్టం అమలు విషయంలో ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. భూభారతి చట్టం ద్వారా సామాన్య ప్రజానీకానికి మేలు జరుగుతుందని తెలియజేశారు. ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలు సాగు భూములను ప్రజలకు ఇచ్చిన చరిత్ర అని, ఇందిరమ్మ ప్రభుత్వంలో భూసమస్యలు లేని ప్రభుత్వంగా ఉండబోతుందన్నారు. భూమి సాగు చేసుకుంటూ భూమిపై హక్కు లేని అర్హులైన ప్రతి పేదవారికి భూమిపై హక్కులు కల్పిస్తామని తెలిపారు.

### ధరణితో రైతుల నరకం: మంత్రి జూపల్లి కృష్ణారావు



మంత్రి జూపల్లి కృష్ణారావు సంవత్సరం కాలం పాటు ఇతర రాష్ట్రాలలోని చట్టాల్ని అధ్యయనం చేసిభూభారతి చట్టాన్ని రూపకల్పన చేసిన రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.గత ప్రభుత్వ కాలంలో ధరణి చట్టం ద్వారా రైతులు తమకు వారసత్వంగా వచ్చిన భూమి హక్కులలో అనేక సమస్యల వల్ల ప్రత్యక్ష నరకం అనుభవించారని గుర్తు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రతిపక్షాలు అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు వాటిని గుర్తించి పేద ప్రజల అభ్యున్నతికై పాటుపడే ఇందిరమ్మ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. పేదల ప్రజలకు సన్న బియ్యం, రైతులకు రుణమాఫీ, సన్న వడ్లకు 500 బోనస్ లాంటి అనేక సంక్షేమపథకాలు ప్రభుత్వంఅందిస్తుందని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చినాటి నుండి రాష్ట్రాన్ని 64 సంవత్సరాల పాటు పాలించిన 21 మంది ముఖ్యమంత్రులు 64 వేల కోట్ల రూపాయల అప్పులు చేస్తే, గత ప్రభుత్వం కేవలం పది సంవత్సరాల వ్యవధిలోనే 8 లక్షల కోట్ల అప్పులు చేసిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన రూ. 8 లక్షల అప్పులపై ప్రస్తుతంతమ ప్రభుత్వం ప్రతీ నెలవడ్డీరూపంలోనే 6వేల కోట్లు, రూపాయలు కట్టాల్సి నదుస్థితి నెలకొందని అన్నారు. 21 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తూ, రైతులకు రెండు లక్షల రూపాయల లోపు పంట రుణాలు మాఫీ చేశామని అన్నారు. ప్రజలు వాస్త వాలను గుర్తించాలని,తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కేవలం ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం, రానున్న రోజుల్లో మరింత విస్తృత స్థాయిలో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయనుందని తెలిపారు.

### భూభారతి చట్టం చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది : నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి



ప్రజా ప్రభుత్వం ద్వారా రూపొందించిన భూభారతి చట్టం చరిత్రలో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి తెలి పారు. భూభారతి చట్టం అమలైన తర్వాత ప్రజలు భూభారతి చట్టం ముందు భూభారతి చట్టం తర్వాత అని మాట్లా డు కుంటారని వివరించారు. భూభారతి చట్టం రైతులందరికీ చుట్టంలా ఉంటుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల మేలు కోసం భూ భారతిని తెచ్చారని తెలిపారు. రైతు బిడ్డకు మాత్రమే రైతుల కష్టాలు, భూమితో రైతుకు ఉన్న అనుబంధం తెలుస్తుందని, భూ భారతి అమలుతో రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందని, భూముల సమస్యలకుశాశ్వత పరిష్కారం లభిస్తుందని భూమికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుందని అన్నారు. భూముల అమ్మకాలు,కొనుగోలుసులభంగా జరుగుతాయన్నారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నభూ సమస్యలు భూభారతితో పరిష్కారమవు తాయని, మీ భూముల సమస్యల పరిష్కారానికి ఎవ్వరి దగ్గర పైరవీలకు పోవల్సిన అవసరం లేదనీ, భూ భారతి పోర్టల్‌లో అన్నిరకాల ఆప్షన్లు ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజలకు సన్నబియ్యం ఇస్తున్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేసిందని అన్నారు.

### భూ భారతి చట్టంతో రైతులందరికి న్యాయం : ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి



స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు కూచకుళ్ళ దామోదర్ రెడ్డి భూ భారతి చట్టంతో రైతులందరికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కూచకుళ్ళ దామోదర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రైతులందరికీ మేలు జరిగేలా భూభారతి చట్టాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రైతులుఎవరు మధ్యవర్తుల,దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు అని తెలిపారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. రైతును రాజు చేయాలనే ఉద్దేశంతోనే ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని పేర్కొన్నారు. చట్టాల అమలులో అధికారుల పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అవినీతి రహితంగా కొనసాగించాలని సూచించారు.

● నాగర్‌కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలు తీర్చేందుకే భూభారతి పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి అన్నారు. భూభారతి చట్టంపై రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా సమగ్ర వివరాలు తెలుసుకోవాలని, నూతన చట్టాన్ని రైతులు అవగాహన చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం 100 సంవత్సరాలు చెప్పుకునేలా ఒక గొప్ప చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. రైతులకు మేలు జరిగేలా, భూ వివాదాలు లేని చట్టంగా ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో ఇలాంటి ఆవకాశము లేదని, ధరణి వల్ల రైతులకు అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు.ధరణి చట్టం ద్వారా బాధింపబడ్డ రైతులందరి దీవెనలతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజలకు అనుగుణమైన భూ సమస్యల పరిష్కారానికి భూభారత చట్టాన్ని తీసుకువచ్చిందని -మిగతా4లో

# గద్వాలలో ప్రోటోకాల్ రగడ

- ◆ మంత్రి పొంగులేటి సమక్షంలో రచ్చ రచ్చ...
- ◆ కాంగ్రెస్‌లో మరోసారి మంత్రి ముందే బగ్గుమన్న విభేదాలు



నేతలతో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి



పోలీస్‌లతో మాట్లాడుతున్న సరిత తిరుపతయ్య

**గద్వాల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ప్రొటోకాల్ రగడ చోటు చేసుకున్నది. ఈ సందర్భంగా కాంగ్రెస్ లోని రెండు వర్గాల మధ్య మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ మల్లు రవి ఎదుటనే బాహా, బాహికి దిగారు. ఈ వివాదం చోటు చేసుకోవడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ మల్లు రవిలు కొద్దీ సేపు తలలు పట్టుకున్నారు. ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగ హాజరయ్యారు. భూ భారతి అవగాహన సదస్సులో ప్రొటోకాల్ రగడ చోటు చేసుకున్నది...జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్‌లో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ప్రొటోకాల్ వివాదం సృష్టించింది.ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సును ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదికపైకి స్థానిక గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డిని ఆహ్వానించి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, జడ్పీ మాజీ చైర్మన్ సరితను పిలవకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు మల్లు రవి కార్యకర్తలను బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వినిపించుకోలేదు. ఎప్పి బాలు రవి వేదిక కిందనే సంపత్ కుమార్ సరిత తిరుపతి కూర్చున్నారు.నాడు మంత్రి జూపల్లి...నేడు పొంగులేటి సమక్షంలో గొడవపడ్డ ఇరువర్గాల నాయకులు. శనివారం జరిగిన భూభారతి కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సరిత -మిగతా4లో

## అకాల వర్షాల దృష్ట్యా వరి ధాన్యం కొనుగోలుపై

# జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలి

● రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి







కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వనపర్తి టౌన్, ఏప్రిల్19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నాయని, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేవిధంగా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలనీ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్లతో వరి ధాన్యం కొనుగోలు, చౌకధర దుకాణాల్లో సన్న రకం బియ్యం పంపిణీ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు మిల్లింగ్ చేసి ఎఫ్‌సిఐకి సకాలంలో అప్పగించాల్సి ఉంటుందని, అలా కాకుండా మిల్లర్లు ధాన్యాన్ని దొంగతనంగా బయట అమ్ముకుంటే పి.డి. యాక్ట్ పెట్టాలని కలెక్టర్లను సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ఉండాలని ప్యాడి క్లీనర్లు, ఎండపెట్టే యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, సరిపడ తూకం మిషన్లు, గన్ని బ్యాగులు, టార్పాలిన్ వంటి మౌలిక వసతులు అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఉండేవిధంగా చూసుకోవాలని ఆదేశించారు. నిబంధన ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని వరి కోత యంత్రాలు 18 నుంచి 20 ఆర్‌పియం, బ్లోయర్ నడుస్తుండగా కోతలు వేయాలని దీనిపై హార్వెస్టర్లకు శిక్షణ ఇప్పించాలని సూచించారు.చౌక ధర దుకాణాల్లో సన్న రకం బియ్యం సరఫరా సజావుగా జరిగేవిధంగా చూడాలని సూచించారు. కొన్ని చోట్ల అన్నం ముద్దగా అవుతుందని ఫిర్యాదులు వస్తున్నాయని, బియ్యంలో 25 శాతం కంటే ఎక్కువ నూకలు ఉండటానికి వీలులేదని తెలిపారు. కలెక్టర్లు చౌకధర దుకాణాలను సందర్శించి ర్యాండంగా పరీక్షించాలని సూచించారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి.ఎస్. చౌహాన్ మాట్లాడుతూ కొత్తగా ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్లు, ప్యాడీ ఎండబెట్టే యంత్రాలు వంటి మౌలిక సదుపాయాలు కొనుగోలుకు అవసరమైన ప్రతిపా దనలు పంపాలని సూచించారు. బ్యాంక్ గ్యారంటీ ఇవ్వని, అగ్రిమెంట్ చేసుకోని మిల్లులకు ధాన్యం కేటాయించవద్దని, మిల్లర్లతో మాట్లాడి పాత బకాయిలు వాసులు చేసి వారితో అగ్రిమెంట్ చేసుకొని ధాన్యం కేటాయించే విధంగా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ గత 2023హ24 సీజన్ కు సంబంధించి మిల్లర్ల నుండి 72 శాతం సియంఆర్ ధాన్యం సేకరించి ఎఫ్‌సిఐకి అప్పగించడం జరిగిందని ధాన్యం స్పగించాని మిల్లుల పై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సైతం 50 శాతం సి.యం.ఆర్ వసూలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 19 మిల్లులతో అగ్రిమెంట్ చేసుకోవడం జరిగినట్టు తెలిపారు. జూరాల ప్రాజెక్టు లో నీటి నిల్వలు తగ్గిపోయినందున తాగు నీటి అవసరాలకు తప్ప వ్యవసాయ సాగుకు ప్రస్తుతం నీటి విడుదల చేయలేమని, కర్నాటక రాష్ట్రంతో మాట్లాడి జూరాలకు కొంత నీటి విడుదల జరిగే విధంగా చూడాలని మంత్రిని కోరారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, పౌర సరఫరాల అధికారి విశ్వనాథ్, ఇరిగేషన్ అధికారులు, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్ కో ఆపరేటివ్ అధికారి బి.రాణి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి తప్పిన పెను ప్రమాదం



హెలికాప్టర్ లాండింగ్ సమయంలో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించిన దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. శనివారం భూ భారతి చట్టం2025 అవగాహన సదస్సు నిమిత్తం నాగర్ కర్నూల్ జిల్లాకు మంత్రి పొంగులేటి, ఎంపీ మల్లు రవి, సంపత్‌కుమార్ హెలికాప్టర్లో వచ్చారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ల్యాండింగ్ చేస్తున్న క్రమంలో సిగ్నల్ కోసం బుల్లెట్ ఫైర్ చేయడంతో కింద ఉన్న గడ్డిపై పడి అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. దీంతో మంత్రికి పెను ప్రమాదం తప్పింది.

## రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణ పరమావధిగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో, గ్రామాలలో జై భీమ్-జై బాపు-జై సంవిధన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, అందులో భాగంగా కల్వకుర్తి మున్సిపాలిటిలోని భగత్‌సింగ్ తండలోశనివారం ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అవగాహన కల్పించారు. రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని రాజ్యాంగం ప్రకారం కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ పరిపాలన జరుగుతుందన్నారు. రాజ్యం పరిరక్షణపైన ప్రమాణం ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యులు ఠాకూర్ బాలాజీ సింగ్,మాజీ సర్పంచ్‌బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌యాదవ్, హన్మనాయక్, కుడుముల చంద్రకాంత్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రేష్మా, స్థానిక నాయకులు పుర కమిషనర్ మహ్మద్ షేక్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, తహశీల్దార్ కార్యాలయం ముందు, మహబూబ్‌నగర్‌చౌరస్తా వద్ద మున్సిపాలిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి హాజరై ప్రారంభించారు.

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

◆ పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టాలి ◆ మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

**మహబూ'బ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** పోలీసు వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ప్రతి అధికారి తన విధులను నిబద్ధతతో, సమర్ధవంతంగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకీ ధరావత్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, న్యాయ సంబంధిత విధుల్లో నిర్లక్ష్యం అంగీకరించదగినది కాదని, ప్రతి కేసు విచారణలో చార్జ్‌షీట్లను నిర్దేశిత కాల వ్యవధిలో న్యాయస్థానాలకు సమర్పించాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు. అలాగే కోర్టు విచారణకు సంబంధించి సాక్షుల హాజరును నిర్ధారించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిగా స్పష్టం చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో సమన్వయాన్ని మెరుగుపరచి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనుమానితులను కోర్టుకు హాజరు పరచే సమయంలోవారిని సురక్షితంగా, సమయానికి న్యాయస్థానాలకు తరలించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని,ఎలాంటి భద్రతా లోపాలు -మిగతా4లో

# అన్నదాతను ముంచిన అకాల వర్షం

**బిజినేపల్లి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** మండలం లోని ఆయా గ్రామాల్లో వివిధ ప్రాంతాల్లో శుక్ర వారం రాత్రి కురిసిన అకాల వర్షం అన్నదాతను నిండా ముంచింది. కోతకు వచ్చిన వరిపంట దెబ్బతింది. కోతల తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసింది. వడగళ్ల వల్ల మామిడి కాయలు నేలరాలడంతో ఆరుగాలం శ్రమించిన రైతన్న కష్టం నీటిపాలయ్యింది. లట్టుపల్లి,గౌరారం,మంగనూరు ఎర్రకుంట తండా, నక్కల చెరువు, ఉడుకులకుంట తండా, పరిసర గ్రామాల్లో కురిసిన ఆకాల వర్షం అన్నదాతను తీవ్రంగా నష్టం కలిగించింది. లట్టుపల్లి ఐకెపి కేంద్రం వద్ద కోతల తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల గాలి దుమారంతో చెట్లు నెలకొరిగాయి. మంగనూరుశివారులోని మామిడి



మంగనూరు శివారులో పంట పొలాల్లో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్



లట్టుపల్లిలో వర్షానికి తడిసిన వరి ధాన్యం

తోటల్లో వడగళ్ల వల్ల మామిడి కాయలు నేలరాలాయి. పంట పొలాల వద్ద, గ్రామ సమీపంలోని సిసి రోడ్లపై, పంట కల్లాల్లో ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడవ డంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. గౌరారం మంగనూరు శివారు ప్రాంతాల్లో వడగళ్ల తీవ్రత ఎక్కువగా కనిపించింది. 50 ఎకరాలకు పైగా కోతకొచ్చిన వరిపంట నేలరాలింది. వీచిన తీవ్రగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగనూరు శివారులో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ పంట పొలాల్లో పడిపోయిందంటే గాలి తీవ్రత ఇట్టే అర్థమవుతుంది. బిజినపల్లి ఆనందగిరి కొండపైనిర్మించిన నీటిట్యాంకుపై పిడుగు పడినట్లు కాలనీవాసులు తెలిపారు.

# పియులో సమ్మె షురూ..

- జీవో నెంబర్ 21 రద్దు చేయాలి
- అర్హత ఉన్న అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్
- మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపిన ఒప్పంద అధ్యాపకులు



మోకాళ్ళపై నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్19 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయంలో ఒప్పంద అధ్యాపకులు నిరవధిక దీక్షకు నడుం బిగించారు. తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకుల జేఏసీ పిలుపుమేరకు పీయూలో ఒప్పంద అధ్యాపకులు నిరవధిక సమ్మెలో భాగంగా మోకాళ్లపై నించొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒప్పందం అధ్యాపకుల సంఘం నాయకులు తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని, జీవో నెంబర్ 21 వెంటనే రద్దు చేయాలని, సెట్టు నెట్టు పీహెచ్‌డి అర్హత ఉన్న ఒప్పంద అధ్యాపకుల అందరినీ బేషరతుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను అందర్నీ క్రమబద్ధీకరించాలని న్యాయమైన డిమాండ్‌తో తలపెట్టిన నిరవధిక సమ్మెకు పీయూ బోధనేతర సంఘం అధ్యక్షులు రామ్మోహన్ జి, ప్రధాన కార్యదర్శి బూరన్న, కార్యవర్గ సభ్యులు రాము,వెంకటేశులు, రమేష్, సురేష్‌లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ జీ మాట్లాడుతూ యూనివర్సిటీ నమ్ముకొని పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించి వారి జీవితాలలో వెలుగులు నింపాలని, ఉన్నఫలంగా బయటకెళ్ళి కొత్త ఉద్యోగాలకు పోటీ పడలేనందునఎంతో అనుభవం ఉన్న ఈ అధ్యాపకులను క్రమబద్ధీకరిస్తే విద్యార్థులకు సంపూర్ణమైన న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు భూమయ్య , శ్రీధర్ రెడ్డి, రవికుమార్, సుదర్శన్ రెడ్డి, విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఈశ్వర్ కుమార్,ప్రదీప్, సురేష్, గౌస్, మొయినుద్దీన్, మృదుల, స్వాతి, అయేషా, హష్మీ తదితరులు పాల్గొన్నారు.

# సంపన్నులతో సమానంగా సన్నబియ్యం

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్

**రాజాపూర్ ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సంపన్నులతో సమానంగా సన్నబియ్యాన్ని అందజేస్తున్నదనిరాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్ అన్నారు. శనివారం రాజాపూర్ మండలం ఇదిగాని పల్లి, నాన్ చెరువు తండా, కల్లేపల్లి, అగ్రహారం పొట్లపల్లి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. అగ్రహారం పొట్లపల్లి గ్రామంలో వడగల్ల వర్షానికి దెబ్బతిన్న రైతు తిరుపతిరెడ్డికి చెందిన వరిచేనును పరిశీలించారు. అనంతరం కల్లేపల్లిలో దళితుడు హంసగల్ల చిన్న ఇంట్లో భోజనం చేసి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం ఎలా ఉందని ఆరా తీశారు. అర్హత గల ప్రతీ పేదవాడికి ఆరోగ్యకరమైన,రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రేషన్ కార్డుదారులకు ఎలాంటి ఆర్థికభారం లేకుండా సన్నబియ్యం అందుతాయనిప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజలు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య




విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని మండల విద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. శనివారం రాష్ట్ర విద్యాశాఖ పిలుపుమేరకు ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమం భాగంగా మండలంలోని లాల్‌కోట ప్రభుత్వ పాఠశాలను పరిధి పూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు,చిన్నచింతకుంట ఉన్నత పాఠశాలలను కురుమూర్తి, అమ్మాపూర్, ఏదులా పూర్‌లోని ప్రభుత్వ యుపిఎస్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు, వడ్డేమాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ధమగ్నాపూర్, నెల్లికొండి యుపిఎస్ విద్యార్థులు సందర్శించారు ఆయా ఉన్నత పాఠశాలలోని ఆకర్షణమైన ఆట స్థలాలు, సైన్స్‌ల్యాబ్, గణిత పరిశోధనశాల, న్యూట్రిగార్డెన్, సీసీ కెమెరాలు తదితర పరిసరాలను విద్యార్థులకు హైస్కూల్ ఉపాధ్యాయులు చూయించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే చక్కటి విద్య బోధన అందుతుందని ఎంఈఓ తెలిపారు. సమ సమాజ నిర్మాణానికి ప్రభుత్వ పాఠశాలలు మూలాధారమని తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకోవాలని ఆయన కోరారు.వేరువేరుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థుల సందర్శన కార్యక్రమంలో ఆయా గ్రామాల యుపిఎస్ పాఠశాలలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిఆర్పిలు విజయసింహ, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



**జడ్చర్ల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** జడ్చర్ల యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశం గుడ్ ఫ్రైడే మరుసటి రోజు అదే విధంగా ఈస్టర్ ఆదివారానికి ముందు రోజు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు భారతదేశ వ్యాప్తంగా ఈ శాంతి ర్యాలీ నిర్వహిస్తారు.అందులో భాగంగా పట్టణ పురవీధుల గుండా సుమారు 8 కిలోమీటర్లు చిన్నారులు, యౌవనస్తులు, మహిళలు,పెద్దలు అందరుఉత్సాహంతో యేసుక్రీస్తు జయ నినాదాలతో పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యునైటెడ్ క్రిస్టియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని మాకు రక్షణ కల్పించాలని క్రైస్తవులుశాంతికాముకులు మాత్రమేకాక అన్యాయం, అక్రమం జరుగుతున్నప్పుడు గర్జించే సింహాలు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవ.కె. విలియం బూత్, ఫిలమోన్, తిమోతి, విద్యాసాగర్,జోసఫ్, మైఖల్ మనోహర్,డానియల్, దేవదానం, ఎబినేజర్, మిట్టు టైటస్, ప్రీతమ్, సందీప్, అబ్రహం ప్రకాష్,లారెన్స్, ఏలియా, టైటస్, నిత్యానందం, నతానియల్, లూథర్, పాస్టర్ శ్యామ్,స్టీవెన్ రాజ్, సువార్త రాజ్, పరంజ్యోతి, దేవదాసు ,ప్రకాష్, ఎలీషా, డా. బి.సందీప్, సాగర్,మోజస్,సల్మాన్, డేవిడ్, డ్యాని,సునీల్, రూబెన్, జాన్సన్, బన్నీ రాజ్, సన్నీ,మోహన్ రాజ్, రాజు, క్రిష్టి, అరుణ్, ఐజాక్, సత్యానందం, రిచర్డ్స్,వినోద్, సుందర్, అనిల్, యాకోబ్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# 21న పిఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా

**గద్వాల టౌన్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ సత్య నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అప్రెంటిషిప్ మేళాకు హైదరాబాదు నుండి వివిధ కంపెనీలు పాల్గొనడం జరుగుతుందని ఐటిఐ పాస్ అయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. అభ్యర్థులు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్,ఒక జిరాక్స్ సెట్ తీసుకొని ఈనెల 21న ఉదయం 10:00 గంటలకు ప్రభుత్వ ఐటిఐ గద్వాల నందు హాజరు కావాలని ఈ ప్రకటన ద్వారా తెలిపారు. మరిన్ని వివరాల కొరకుఫోన్ నెంబర్ 9110523925, 8341441763 నెంబర్లను సంప్రదించవలసిందిగా కోరారు.

# ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపాం

### ఇకపై భూ భారతి చట్టంతో ప్రతి సమస్య పరిష్కారం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్19 ప్రభాతవార్త:** గత పదేళ్ళుగా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన మాయదారి ధరణి చట్టాన్ని బంగాళాఖాతంలో కలిపామని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూ భారతి చట్టంతో రైతులకు ఉన్న భూ సమస్యలను గ్రామీణ స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చునని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డా.మల్లురవి ,ఆధ్వర్యంలో నిర్వహించిన భూభారతి అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టంతో గ్రామాల్లో నెలకొన్న ప్రతి భూ సమస్యను పరిష్కరించుకోవచ్చునని సమస్యలున్న ప్రతి రైతు స్థానికంగా ఉండే తాసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి,ఎఐసిసి సెక్రెటరీ సంపత్ కుమార్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ రెవెన్యూ శాఖ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై జరుగుతున్న కుట్రను తీవ్రంగా ఖండిస్తున్నాం

**మక్తల్ టౌన్,ఏప్రిల్19 ప్రభాతవార్త:** జ్యోతిరావు పూలే బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసరి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మక్తల్ శాసనసభ్యులుగా ఎన్నికైనటువంటి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిపై ఈ మధ్యకాలంలో కొందరు అజ్ఞాత వ్యక్తులు తెరవెనుక నాయకులు లేఖల రూపంలో ఎమ్మెల్యే పేరు ప్రతిష్టలను దెబ్బ తీయాలనే ఉద్దేశంతో కుట్రలతో ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి వాతావరణం సరైనది కాదు. ఆయన అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని క్రింది స్థాయి నుంచి అంచలంచలుగా ఎదుగుతూనేడు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఒక బహుజన బిడ్డ రాజకీయంగా అభివృద్ధి చెందుతుంటే రాజకీయంగా ముందుకు పోకుండా అధిష్టానం దృష్టిలో చెడ్డవాడిగా చిత్రీకరించాలని చేస్తున్నటువంటి మేధావులు తెరవెనక నాయకులు ఒకసారి ఆలోచించాలి. కౌన్సిలర్‌గా జడ్పిటిసిగా,మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా నేడు శాసనసభ్యుడిగా రాజకీయ ప్రయాణం చేస్తున్నారు. అలాగే తనకు మంత్రి పదవి వస్తుందనే అక్కసుతో తెర వెనుక నాయకులు ఇతర పార్టీల నాయకులు మంత్రి పదవి రాకుండా ఉండాలని అధిష్టానానికి చెడ్డవాడిగా చూపించాలని లేఖల రూపంలో చేస్తున్నటువంటి ప్రయత్నాలు ఏమాత్రం ప్రభావం చూపవు. గతంలో డయాలసిస్ బాధితులు సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లి వైద్యంచేయించుకునేవారు. ఈరోజు తెర వెనుక ప్రశ్నిస్తున్నటువంటి నాయకులుగాని వ్యక్తులుగాని వీటన్నిటి పైన గత పాలకులను ఎందుకుప్రశ్నించలేదు మరి ఈరోజు ఒక బహుజన బిడ్డ రాజకీయంగా ముందుకువెళుతుంటే ఆయనను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఆయనకు అధిష్టానంఅండగా ఉంటుంది మరియు ఆయనకు ఖచ్చితంగా మంత్రి మండలిలో చోటు కల్పించి మంత్రి పదవులు వరిస్తాయి.ఈ యొక్క విష సంస్కృతిని జ్యోతిరావు పూలే బీసీ సంఘం తీవ్రంగా ఖండిస్తుంది.ఈ తెర వెనుక రాసినటువంటి లేఖల పై పోలీసు శాఖ వారు కూడా స్పందించి విచారణ చేపట్టవలసిందిగా ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం. ఖచ్చితంగా న్యాయ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుంతలి ఆంజనేయులు,టి నరేష్,మంగలి రవి, మహమ్మద్ నాసిర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిసి సంఘం నాయకులు

# యత్మతాపూర్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

### ఉత్సాహంగా ఆడి, పాడిన విద్యార్థులు

**తాడూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** తాడూరు మండల పరిధిలోని యత్మతాపూర్ పాఠశాలలో శనివారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలలకు మించి సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం మండలంలో మొదటిసారి అని, జిల్లాలో కూడా రెండు మూడు చోట్ల మించి నిర్వహించలేదని ఉపాధ్యాయురాళ్లను అభినందించారు. కార్యక్రమాన్ని అత్యంత అద్భుతంగా వినూత్నంగా విజయవంతంగా నిర్వహించినందుకు హెచ్‌ఎంకు ఎంఈఓ రూ. 5000 బహుమానం అందజేశారు.ఇలాంటి కార్యక్రమాలు ముమ్ముందు మరింత నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు మించి చదువు సంస్కృతిక కార్యక్రమాలు హేట్మతాపూర్ పాఠశాలలో నిర్వహిస్తున్నందుకు గ్రామస్తులు పూర్తి సహకారం అందించాలని తమ పిల్లలని ఇక్కడే చేర్పించాలని ఎంఈఓ కోరారు. ఉపాధ్యాయురాలు సమతారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్‌డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం



నృత్యం చేస్తున్న చిన్నారులు

## ప్రజావాణి కార్యక్రమం రద్దు : జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 26 తేదీ వరకు జిల్లా అధికారులు భూ భారతి 2025 చట్టంపై మండలాల్లో రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అందువల్ల ఏప్రిల్ 21 నాటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడోక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి సోమవారం నాటి ప్రజావాణికి ఫిర్యాదులతో కలెక్టరేట్‌కు ఎవరు రావద్దని కోరారు.

## సమాజ సేవకు పునరంకితం కావాలి

**మక్తల్, ఏప్రిల్19 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా తమ వంతు సేవగా సమాజ సేవకు పునరంకితం కావాలని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న జి.ఎల్లప్ప ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం స్థానిక కన్యక పరమేశ్వరి ఆలయంలో సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జి.ఎల్లప్ప దంపతులను పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ జి.బాలకృష్ణ రెడ్డి, మాజీ ఎంపీపీ బి.కొండయ్య, ఎంఈఓ అనిల్‌గౌడ్, జిహెచ్‌ఎం వెంకటయ్య గౌడ్, పిఆర్టియు నాయకులు తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీ పెండింగ్ బకాయిలు ఇవ్వాలి

**అమరచింత, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ బకాయిలను ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్ అజయ్ డిమాండ్ చేశారు.శనివారం అమరచింత మండలంలోని సింగంపేట గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న కూలీల దగ్గరికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల దగ్గర కూలీలకు మంచినీటి సౌకర్యం లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు త్రాగునీటిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలనినిబంధన ఉన్నఅధికారులు ఏర్పాటు చేయక పోవడం శోచనీయమని, అలాగే టెంటు కూలీలకు పనిముట్లు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఉపాధి హామీ పని 20 రోజులు చేయాలని నిబంధన ఎత్తివేయాలని, ఉపాధి హామీలో కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి 600 ఇవ్వాలని ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మండలంలో వివిధ గ్రామాలలో పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలనికూలీలతో కలిసి తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామనిఆయనహెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శంకర్, శ్రీనివాసులు,ఆనంద్,ఆంజనేయులు, జయమ్మ, అనంతమ్మ, భూషణం, మంజుల, తదితరులు పాల్గొన్నారు.



# ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్

### నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యాశాఖ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్19 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లో శనివారం ట్వినింగ్ ఆఫ్ స్కూల్స్ ప్రోగ్రాం అనగా పాఠశాలలను జతపరిచే కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తెలిపారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మధ్య ట్వినింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ వద్ద గాంధీ రోడ్డు ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో ఉన్న 87 యుపిఎస్ పాఠశాలల విద్యార్థులను వారికి సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలలసందర్శన పేరుతో ఈకార్యక్రమం రూపొందించినట్లు ఏఎంఓ తెలిపారు.ఈకార్యక్రమంలో భాగంగా యుపిఎస్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులని వారికి సమీపంలో ఉన్న ఉన్నత పాఠశాలకు తీసుకెళ్లి అక్కడ జరుగుతున్న విద్యా బోధన సౌకర్యాలుఅనగా లైబ్రరీ, ప్రయోగశాలలు,ఐఎఫ్‌పి టివిలు, బులిటెన్ బోర్డు, ఆట వస్తువులు, ప్లే గ్రౌండ్, ఉన్నత పాఠశాలలో లభించేఆర్ట్, క్రాఫ్ట్,టైలరింగ్‌లాంటి కలల గురించి విద్యార్థులకు తెలియజేయడం ముఖ్యఉద్దేశమని ఆయన వివరించారు. విద్యార్థులంతా ఆసక్తిగా పాల్గొని నూతన విషయా లను తెలుసుకోవడం, అదేవిధంగా వారు ఉన్నత తరగతులకు వచ్చేటప్పుడు ఈ పాఠశాలలోని చేరుతామని విద్యార్థులు తెలిపారన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**నవాబ్‌పేట్ ఏప్రిల్19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు తహసిల్దార్ శ్రీనివాస్, మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుశ్యాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుల సమక్షంలో మండల పరిధిలోని పలు గ్రామాల లబ్ధిదారులకు నవాబ్‌పేట్, కారుకొండ,పోమాల్, రుద్రారం, కొండాపూర్,ఇప్పటూరు, కామరం, లోకిరేవు, సిద్దోటం, గురుకుంట, కాకర్లపాడు గ్రామాల నుండి దాదాపు 24మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డికి,మాజీ అధికార ప్రతినిధి జనంపల్లి దుష్యంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,నీరటి రామచంద్రయ్య ఏఎంసీ చైర్మన్ హరలింగం,వైస్ చైర్మన్ తులసిరామ్‌నాయక్, యువజన అధ్యక్షులు నీలకంఠం, ప్రజా ప్రతినిధులు,యువజన నాయకులు,కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్ పర్సన్

**జడ్చర్ల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం సన్నాళ్లకు అందిస్తున్న రూ.500 బోనస్‌ను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలనిబాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జ్యోతి ఆల్వాల్ రెడ్డి సూచించారు. జడ్చర్ల మండల పరిధిలోని కోడ్గల్ గ్రామములోముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు కోడ్గల్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన ఇద్దరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మెన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, జిల్లా కిసాన్ సంఘ్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, మార్కెట్ డైరక్టర్లు, సింగిల్ విండో సీఈఓ కాటెమోని యాదగిరి, కొడుగల్ గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీశైలం, సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

## బీసీల ఐక్యతతోనే హక్కుల సాధన

**చిన్నచింతకుంట, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** బిసి ఫెడరేషన్ నూతన మండల అధ్యక్షులు చెన్నయ్య గౌడ్‌ను శనివారం నియమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల ఐక్యతతోనే హక్కులను సాధించుకోవచ్చని ఆయన తెలిపారు. మండలంలో బీసీ ఫెడరేషన్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.బీసీలు కలిసికట్టుగా పనిచేస్తే రాజకీయంగా, ఆర్థికంగా ముందుంటామని ఆయన తెలిపారు. ఎస్సీ,ఎస్టి, బీసీ, మైనార్టీ ఆదివాసి వర్గాలు ఒక తాటిపైకి వస్తేనే రాజకీయ అధికారం పొందవచ్చన్నారు. బిసి ఫెడరేషన్ నూతన మండల అధ్యక్షులుగా నియమించినందుకు బిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగనమోని చిన్న రాములుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అమడపాకుల రామన్ గౌడ్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, సీనియర్ బిసి నాయకులు వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## చిన్నారుల ఎదుగుదల కోసం పోషన్ పక్వాడ్



పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న సిడిపిఓ, బృందం

**పెబ్బేరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయల నుంచి లభించే పోషకాలపై అవగాహన కల్పించారు.అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో పోషకాహారంపై అవగాహన పెరిగేలా చేయడమే లక్ష్యంగా కార్యక్రమం చేస్తున్నమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ సిడిపిఓ బాల్లీశ్వరి, ఏసీడిపిఓ ఝాన్సీలక్ష్మి, హెచ్‌ఎం మల్లికార్జున్ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు శ్యామల, స్వరూప రాణి, మంజుల, సావిత్రి,గ్రామంలోని చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



**ఆత్మకూరు, ఏప్రిల్19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నటువంటి అగ్నిమాపక నిరోధక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు ఆత్మకూరు మండలంలో గత ఐదు రోజులుగా నిరవధికంగా కొనసాగుతున్నాయి శనివారం ఆత్మకూరు అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు నేతృత్వంలో కస్తూరిబాగాంధీ విద్యాలయ విద్యార్థులకు అగ్నిమాపక నిరోధక శాఖఅధికారులు అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సినజాగ్రత్తల గురించి డెమో క్లాసు వివరించారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలలో కానీ ప్రైవేట్ పాఠశాలలుకానీ నిర్మాణాల నేపథ్యంలోనే అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు సులభంగా బయటపడే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని నిర్మాణాలను కొనసాగించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక నిరోధక అధికారులు నసింహారెడ్డి ,భీమిరెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం పూట బస్సును తిరిగి ప్రారంభించాలి

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** మండల కేంద్రం నుంచి మహబూబ్‌నర్‌కు ఉదయం పూట 5 గంటల బస్సును తిరిగి ప్రారంభించాలని బిజెపి మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం వనపర్తి ఆర్టీసీ డిపో డిఎం వేణుగోపాల్ కు వినతి పత్రం అందజేసినట్లుబిజెపి మండలపార్టీ అధ్యక్షుడు బుచ్చిబాబు తెలిపారు. మహబూబ్‌నగర్ కు ఉదయం పూట బస్సు లేకపోవడంతో వ్యాపారస్తులు హైదరాబాదుకు వెళ్లేవారు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, గత మూడు నెలల నుండి ఈ బస్సులు రద్దు చేయడం జరిగిందని వెంటనే ప్రారంభించాలని కోరారు. స్పందించిన డిఎం విచారణ జరిపి బస్సులు నడిపే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి దశరథం యువమోర్చా మండల అధ్యక్షుడు గోపి సీనియర్ బిజెపి నాయకులు గుర్రం శీను పాల్గొన్నారు.



వనపర్తి డిపో మేనేజర్ కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

# భర్త హత్యకు సహకరించిన భార్య

◆ ఐదుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

◆ హత్యలకు దారితీస్తున్న అక్రమ సంబంధాలు



నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** పోలీసులను పక్కదోవ పట్టించే విధంగా హత్యకు సంబంధం లేని వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ నమోదు చేసిన ఫిర్యాదులో పోలీసుల విచారణ చివరికి ఫిర్యాదుదారులే సూత్రధారులుగా తేల్చింది. సంవత్సరాల పాటు కలిసి జీవించిన వైవాహిక జీవితానికి అక్రమ సంబంధం అడ్డు వచ్చింది. వివరాల్లోకి వెళితే వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం కొత్త సూగూరు గ్రామానికి చెందిన రవి మార్చి19వ తేదీన సుగురు గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మరణించి నట్లు. మృతుడి భార్య సునీత కొందరు వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేస్తూ పెబ్బేర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించి విచారణ చేపట్టిన పెబ్బేర్ ఎస్సై యుగంధర్ రెడ్డికి ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. విచారణ అనంతరం హత్యకు పాల్పడిన వారిని అదుపు లోకి తీసుకొని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సమక్షంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్పి రావుల గిరిధర్ రావు మాట్లాడుతూ. మృతుడు అతని భార్య సునీత గత కొంతకాలంగా నరేష్ అనే మేస్త్రి దగ్గర పని చేస్తున్న క్రమంలో అక్కడే పనిచేస్తున్న శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన అరవింద్ అనే వ్యక్తితో సునీతకు అక్రమ సంబంధం ఏర్పడిందని ఈ విషయం సునీత భర్తకు తెలిసి అరవింద్ ను పలుమార్లు హెచ్చరించడం జరిగిందని అప్పటినుండి మృతుడు తనభార్య ఇబ్బంది పెడుతున్నారని ఈ క్రమంలో అందుకు పగతో సునితను తన భర్తఅడ్డు తొలగించమని అరవిందుకు చెప్పడంతో అరవిందు తన స్నేహితులు అయినా భగవంతు, గిరితో కలిసి మద్యం సేవించడానికి తీసుకు వచ్చారు. కొత్త సూగూరు పాత సుగురు మధ్యగల స్మశాన వాటికల దగ్గరకు కూర్చుని మద్యం తాగుతూ రవికి ఎక్కువగా తాగించి మత్తులోకి వెళ్లేలా చేసి రాత్రి 8 గం.ల సమయంలో పథకం ప్రకారం అందరూ కలిసి రవి ముఖానికి ప్లాస్టిక్ కవర్లు చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపారని ఎవరికీ అనుమానం రాకూడదని కొత్త సుగూరు ఊరి బయట రోడ్డు పక్కన శవాన్ని ఉంచి నేరానికి ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్లను బూడిదపాడు దగ్గరవాగులో పడేసి వెళ్లిపోయారని నేరాన్ని పోలీసువిచారణలో అంగీకరించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వర రావు, కొత్తకోట సీఐ,రాంబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, పెబ్బేరు ఎస్సై, యుగంధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డివైడర్ ఎక్కి ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొన్న కారు

● ప్రమాదంలో భార్యాభర్తలు మృతి



జాతీయ రహదారిపై టైరు పగిలి డివైడర్ దాటి ప్రమాదానికి గురైన కారు

**ఇటిక్యాల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోదండపురం పోలీస్ స్టేషన్ పరిధి 44 నెంబర్ జాతీయ రహదారి ప్రియదర్శని హోటల్ ఎదురుగా వేముల స్టేజి సమీపంలో హైదరా బాద్ నుండి నంద్యాల వైపు వెళ్తున్న కారు టైరు పగిలి కంట్రోల్ తప్పి రోడ్డు డివైడర్ దాటి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును ఢీకొనగా కారులో ఉన్న పుల్లారెడ్డి, లక్ష్మీ పుల్లమ్మకు తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోగా వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా పుల్లారెడ్డి (59) లక్ష్మి పుల్లమ్మ (51) భార్యాభర్తలు మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. అలాగే స్రవంతి అనే మహిళకు కుడి చెయ్యి విరిగినట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై మురళి వివరాల మేరకు మహేశ్వరమ్మ తన బంధుమిత్రులైన దేరెడ్డి పుల్లారెడ్డి అతని భార్య దేరెడ్డి లక్ష్మి పుల్లమ్మ పుల్లారెడ్డి కుమారుడు దేరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అలాగే స్రవంతి అందరూ కలిసి సుబ్బారెడ్డి బ్రీజా కారులో హైదరాబాదులోని తన బంధువుల గృహప్రవేశం ఉన్నందున కాకునూరు గ్రామం బండి ఆత్మకూరు మండలం నంద్యాల జిల్లా నుండి హైదరాబాద్‌కు శుక్రవారం ఉదయం వెళ్లారని అదే రోజు రాత్రి 8:30 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్ నుండి వారి సొంత గ్రామానికి వెళ్తుండగాశుక్రవారం అర్ధరాత్రి సమయంలో వేముల స్టేజి సమీపం లోని ప్రియదర్శిని రెస్టారెంట్ ముందు 44వ నెంబర్ జాతీయ రహదారి రోడ్డుపై సుబ్బారెడ్డి అతివేగంగా తన కారు నడుపుతుండగా ముందు టైరు బ్లాస్ట్ అయి కంట్రోల్ తప్పి రోడ్డు డివైడర్ దాటి అవతల వైపు కర్నూలు నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొనగా సుబ్బారెడ్డి తండ్రి పుల్లారెడ్డి. తల్లి దేరెడ్డి లక్ష్మి పుల్లమ్మకు తీవ్రమైన రక్త గాయాలు తగిలి స్పృహ కోల్పోయారని వారిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో కర్నూల్ లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా దేరెడ్డి పుల్లారెడ్డి తన భార్య దేరెడ్డి లక్ష్మి పుల్లమ్మలు మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరి ంచారని ఎస్ఐ వివరించారు. అలాగే స్రవంతి అనే మహిళకు కుడి చెయ్యి విరిగినట్లు మహేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై కే.మురళి తెలిపారు.

## కంటైనర్‌లో తాత్కాలిక డయాలసిస్ సేవలు

**ఆత్మకూరు, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో గత సంవత్సరం డిసెం బర్‌లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి చేతుల మీదుగా డయాల సిస్ సెంటర్‌ను ప్రారంభించినప్పటికీ సేవలు ఉపయోగం లోకి రాకపోవడంతో పలువురు విమర్శిస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు శనివారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కంటైనర్ లో తాత్కాలిక సేవలను ప్రారంభించి నట్లుగా ఆత్మకూర్‌మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పరమేష్ మాజీ మండల అధ్యక్షుడు రహమతుల్లా తదితరులు వెల్లడించారు. ఉమ్మడి ఆత్మకూరు మండలం లోనే కాకుండా ఆత్మకూరు సబ్ డివిజల్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు డయాలసిస్ పేషెంట్లు చికిత్స నిమిత్తం వనపర్తి తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లి చికిత్సలు కొనసాగిస్తున్న నేపథ్యంలో మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించినప్పటికీ ఆత్మ కూరులో నూతనంగా మంజూరైన ఆసుపత్రి భవనం నిర్మించే వరకు తాత్కాలికంగా కంటైనర్ లోనే డయాలసిస్ సేవలను వినియోగం లోకి తేవాల్సిందిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించడంతో తక్షణమే డయాలసిస్ సేవలు కొనసాగించేందుకు కంటైనర్ను శనివారం ప్రారంభించినట్లుగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తులసి రాజు యాదవ్, ఆత్మకూర్ టౌన్ పార్టీ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాసులు ,కాంగ్రెస్ నాయకులు మనివర్ధన్ రెడ్డి, దామోదర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి నర్సింగ్ హోమ్ ఆస్పత్రిని సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారి

**ఆత్మకూరు,ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సాయి నర్సింగ్ హోమ్ ఆస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆసుపత్రిని సీజ్ చేయడం జరిగిందని జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. ఈనెల 8వ తేదీన ఉమ్మడి ఆత్మకూరు మండలంలోని చంద్రకళ గ్రామానికి చెందిన మహిళ ప్రసవానికి ఆసుపత్రికి చేరుకోగా నిబంధనలకు విరుద్ధంగా అనస్తీనియా ఇంజక్షన్ లేకుండానే శస్త్ర చికిత్స నిర్వహించిన బ్లూగా సిసి ఫుటేజ్ ద్వారా విచారణలో తేలడంతో నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశామని ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఆసుపత్రిని సీజ్ చేసినట్లుగా ఆయన తెలిపారు. అంతేకాకుండా పట్టణంలోని మరికొన్ని ఆసుపత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా రోగులకు చికిత్సలు నిర్వహిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## హత్య కేసును ఛేదించిన అచ్చంపేట పోలీసులు

● నిందితులపై రౌడీషీట్ ఓపెన్ ● ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు

● విలేకరుల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వరరావు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వరరావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామ సమీపంలో ఈ నెల 15న బూరం వీరయ్యను అతి దారుణంగా హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర రావు తెలిపారు. శనివారం అచ్చంపేట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వరరావు మాట్లాడుతూ అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామ శివారులో ఈనెల 15న బూరం వీరయ్యను హత్య చేసిన ముగ్గురు నిధితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నడింపల్లికి చెందిన సూగురు మహేష్, పదిర శివ, ఎద్ల మహేష్‌లు కాపు కాసి బైక్‌పై ప్రయాణిస్తున్న వీరయ్యపై గొడ్డలి, సుత్తేతో దాడి చేసి హత్య చేశారని తెలిపారు. సూగురు మహేష్ భార్యను వీరయ్య కుమారుడు పరమేష్ అక్రమ సంభందం పెట్టుకొని గుంటూరుకు తీసుకెళ్లాడని, ఆ సంఘటనను మనస్సులో పెట్టుకొని సూగురు మహేష్ పథకం ప్రకారం మరో ఇద్దరు నిందితులతో కలిసి హత్యకు పాల్పడినట్లు అయన తెలిపారు. ఈ మేరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి ముగ్గురి పై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు ఆయన తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు వచ్చి సామరస్యంగా పరిశించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. హత్యకు ఉపయోగించిన ఒక కారు, ఒక గొడ్డలి రెండు సుత్తెలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. పక్కా సాక్షాదారులను కోర్టులో సమర్పించి నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కేసును చేధించిన అచ్చంపేట పోలీసులను జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వరరావు అభినందించారు. మీడియా సమావేశంలో డిఎస్పీ శ్రీనివాస్, సిఐ రవీందర్, ఎస్ఐ ఇందిర, పోలీస్ సిబ్బంది తదితరులు పాలోన్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడే ఈస్టర్ పండుగను పురస్కరించుకొని కల్వకుర్తి పట్టణంలోని అన్ని సంఘాల పాస్టర్లు నాయకుల ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి రక్షణ కోసం ఈలోకంలో యేసు జన్మించారని, అందరిని సమానంగా చూడాలని ప్రేమ, కరుణ, భావాలతో మెలగాలని సేవతో ఉండాలని చెప్పిన కరుణామయుడు అన్నారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.కాగా మహబూబ్‌నగర్ చౌరస్తా నుంచి ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం హైదరాబాద్ చౌరస్తా, కూరగాయల మార్కెట్, బస్టాండ్ నుంచి ఎంబి చర్చి వరకు చేరుకుంది. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మానవాళి పాప విమోచనానికి ఏసుక్రీస్తు తన ప్రాణాలను సిలువలో అర్పించిన రోజును గుడ్‌ఫ్రైడే గా తిరిగి మూడో రోజు ఆదివారం సమాధిలో నుండి లేచిన రోజు ఈస్టర్‌గా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలోప్లాస్టర్ రెవరెండ్ జేబీ రాజు, పాస్టర్స్ యోహాను ఆనంద్‌కుమార్, యేసయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ ఠాగూర్‌బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, క్రైస్తవ నాయకులు గుమ్మకొండ రాజు,నేరటిరవి, నందు, జ్యోతి ప్రసాద్, శ్రీకాంత్, బొల్లేరాజు, ఏదుల ఆనంద్,చింటూ, ప్రేమ్, ప్రభాకర్, పలు సంఘాల పాస్టర్స్ క్రైస్తవ సోదరి సోదరులకు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో రైతులకు మేలు

● పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి





సదస్సులో మాట్లాడుతున్న టి.రామ్మోహన్ రెడ్డి

**గండీడ్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "భూ భారతి చట్టం"పై శనివారం గండీడ్ మండలం వెన్నచెడు గ్రామంలో ఏర్పాటు చేసినఅవగాహన సదస్సులో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పాల్గొని ప్రసంగించారు. భూ సమస్యల పరిష్కారానికి భూభారతి సత్వర పరిష్కారం చూపుతుందన్నారు. రైతుల పక్షపాతిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి చట్టం అమలుచేస్తున్నారని అన్నారు.గతంలో బీఆర్ఎస్ పాలనలో ధరణి పోర్టల్ ద్వారా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన ఆరోపించారు. అది గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయిమాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు, ప్రజలకు మండల, గ్రామస్థాయి అధికారులకు, మహిళా సమైక్య సభ్యులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్డిఓ నవీన్, రిటైర్డ్ ఎమ్మార్వో భూభారతి ట్రైనర్ జాఫర్ హుళ్ళ ఖాన్, మండల తహశీల్దార్ నాగలక్ష్మి, మండల ఎంపీడీఓ దేవయ్య, డిప్యూటీ తహశీల్దార్ మాధవి, పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మినారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కే జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యులు నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు అనంత లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, మండల వ్యవసాయ అధికారులు. మహిళా సంఘాల సభ్యులు మండల పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికి ఇండ్లస్థలాలు, ఇండ్లు అందించాలి

-అక్రిడేషన్ల జారి ప్రక్రియను ప్రారంభించాలి

-టీయూడబ్ల్యూజే (హెచ్ 143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ సారథ్యంలో మంత్రి పొంగులేటికి వినతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, ఇండ్ల సమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ వారి అర్హతను గుర్తించి ప్రభుత్వపరంగా ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లను మంజూరు చేయాలని కోరుతు శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ యూనియన్‌ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, హెచ్ 143 యూనియన్ ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్,రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్, జాతీయ నాయకులు జెమిని సురేష్, ఉమా శంకర్ హొదేకార్, మహమ్మద్‌రవూఫ్, టియుడబ్ల్యూజే యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం అందించారు. అంతకుముందు మంత్రి పొంగులేటికి జర్నలిస్టులు శాలువలు పూల బొకేలతో ఘనంగా సన్మానించిస్వాగతం పలికారు. వినతిపత్రంలో జిల్లాలోని నియోజకవర్గాలతో పాటుమండల కేంద్రాలలో ప్రభుత్వపరంగా భూములను గుర్తించడం జరిగిందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు అందించడంలో జాప్యం జరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని నియోజవర్గాలు, మండల కేంద్రాలలో ప్రభుత్వ పరంగా స్థలాలను గుర్తించడం జరిగింది. మంత్రికి అందిం చిన వినతిపత్రం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు అందించి సమ స్యను పరిష్కరించాలని మంత్రి శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారు. అర్హులైనజర్నలిస్టులు అందరికీహెల్త్ కార్డులు అందించాలని, అదేవిధంగా ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో టీయూడబ్ల్యూజే (హెచ్143) , తెలంగాణఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్‌ల నాయకులు రాజేష్ గౌడ్, శేఖరాచారి, అచ్చంపేట నియోజ కవర్గ నాయకులు శ్రీనివాస్, శేఖర్,తెలంజిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మొహమ్మద్‌ముస్తాక్,పుల్లయ్య,నరసింహ,గోవిందు సాజిద్, బాల స్వామి, సత్యం, ఫోటో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కపిలవాయి రాజు, ఆవుల భాస్కర్ బాబు, అహ్మదుల్లా ఖాన్, ఇర్ఫాన్ ఖాన్,సాదిక్,సురేష్,శేఖర్, బాలు, పరమేష్ పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మండలం సోళీపురం గ్రామ లక్ష్మినరసింహ యోగానంద బ్రహ్మోత్సవాల మహోత్సవాల 126వ సంవత్సర ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాలా సందర్భంగా గ్రామంలో గత 22 సంవత్సరంగా కొనసాగుతున్న అంతరాష్ట్ర బండలాగుడు పోటీలను శనివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామాల్లో నిర్వహించే ఈ బండలాగుడు పోటీలకు ప్రత్యేక ఆకర్షణ ఉంటుందని, బండలాగుడు పోటీలు నిర్వహించే గ్రామాలలోపండగ వాతావరణం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బండలాగుడు పోటీలకు వచ్చే పశుపోషకులు ఎంతో శ్రద్ధగా వారి పశువులను పోషిస్తారని పశువులను సొంత బిడ్డల మాదిరి చూసుకునే వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సోళీపురం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటయ్య, సాయి చరణ్ రెడ్డి, వెంకట్రావు, ఆగారం ప్రకాష్, శేఖర్ రెడ్డి, వనపర్తి మాజీ కౌన్సిలర్‌బ్రహ్మంచారి, యాపర్ల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంజాయి రమేష్, శ్యాంసుందర్, రవి నాయక్, భాస్కర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకటయ్య, ఓమేష్, కృష్ణయ్య యాదవ్, క్యామరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న అభివృద్ధే సింగిల్ విండో లక్ష్యం

సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు

**వెల్దండ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు దళారులను నమ్మి మోసపోవద్దని సింగిల్ విండోలా ఆధ్వర్యంలోఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలోనే రైతులు వరి ధాన్యాన్ని విక్రయించాలని సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారిని శోభారాణి, సింగిల్ విండో డైరెక్టర్లతో కలిసి చైర్మన్ జూపల్లి భాస్కరరావు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వంఇచ్చే మద్దతు ధర పొందాలని సూచించారు. రైతన్నల ఆర్థికంగా బలోపేతంకోసం సింగిల్‌విండో ఎప్పుడు ముందుంటుందని, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, నాగులునాయక్, శేఖర్ ముదిరాజ్, నరేష్,జంగయ్య, రాఘవేందర్‌రెడ్డి, వసంత, నాయకులు పుల్లయ్య,నారాయణ, మాజీ సర్పంచ్ సాయి,పీఏసీఎస్ సిబ్బంది శ్రీనివాస్, వెంకట్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం

మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



**అమరచింత, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయముగా ముందుకు సాగుతుందని మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం అమరచింత మండలం లో ధర్మాపూర్, నందిమల్ల గ్రామాలకు 3 కోట్ల 40 లక్షల నిధులతో బీటీ రోడ్ల నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజు గౌడ్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే,డాక్టర్ వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ఎన్నికలలో గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తామని ఆయా గ్రామాల ప్రజలకు ఇచ్చినహామీ మేరకు బీటి రోడ్ల పనులను చేపడుతున్నామని ఆయన అన్నారు. బీటి రోడ్ల పనులలో కాంట్రాక్టర్లు నాణ్యత పనులను చేపట్టాలని నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్ల పై చర్యలు తప్పవనిఆయన అన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, రవికుమార్, ఎంపీడీఓ, చెన్నమ్మ పంచాయతీరాజ్ ఏఈ నరేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు కేజీ మహేందర్‌రెడ్డి,అరుణ్‌కుమార్,మాజీ ఎంపీటీసీలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, ధర్మపురం శ్రీనివాస్, ఆంజనేయులు, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సత్య రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఆయాగ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాటకాలను ప్రోత్సహిద్దాం.. భావితరాలకు అందిద్దాం!



**వెల్దండ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** నాటకాలు గత చరిత్రలో జరిగిన సత్యాలు, సుపరిపాలన, మనుషుల మధ్య సంబంధాలు అనుబంధా లను ఆనాటి చరిత్రను తెలిపే వీధి నాటకాలను ప్రోత్సహించి కాపాడుకొని భావితరాలకు అందిద్దామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బైలు నాటకానికి రాఘవేందర్‌రెడ్డి రూ.30వేలు నాటక బృందం సభ్యులకు అందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, కొండల్ యాదవ్, మల్లయ్య, రంజాన్, శ్రీశైలం, నాటక బృందం సభ్యులు జంగయ్య, సాయిలు, రాములయ్య, తిరుపతయ్యతో పాటు తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి : జిల్లా కలెక్టర్

**గండీడ్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు,మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శనివారం గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలో ఐ,కె,పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కొను గోలు కేంద్రంలో రైతులకు కనీస సౌకర్యాలు త్రాగు నీరు, టెంట్, ఫ్లెక్సీ, అదే విధంగా గన్ని లు, ప్యాడి క్లీనర్ మౌలిక సదుపాయాలు లేకపోవడం గమనించి కొనుగోలు కేంద్రం నిర్వాహకులుఏ.పి.ఎం, సి.సి.పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావలసిన అన్ని సౌకర్యా లు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం లో కనీస మౌలిక సదుపాయాల ఏర్పాట్లలో నిర్లక్ష్యం చేయకుండా, ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. కలెక్టర్ తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, మండల ప్రత్యేక అధికారిసంజయ్ కుమార్, ఎం.పి.డి.ఓ, తహశీల్దార్‌లు ఉన్నారు.

## నేడు లింగాలలో ఉచిత మెగా వైద్య శిబిరం

**లింగాల, ఏప్రిల్19 ప్రభాతవార్త:** నేడు లింగాల మండల కేంద్రంలోని నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం (నేడు)నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్చర్ల అనుభవజ్ఞులైన వైద్యులచే,సమాచార హక్కు చట్టంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, ఉదయం 10 గం.ల నుంచి మధ్యాహ్నం 1 వరకు ఉచిత మెగా వైద్యశిబిరం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ తెలిపారు.

## హజ్ యాత్రికులకు టీకాలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మక్కాకువెళ్లే హజ్ యాత్రికలకు ఆరోగ్య పరీక్షలు, టీకా వ్యాక్సిన్ చేయాలని జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ కె.వి స్వరాజ్యలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. హజ్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ ఫరీద్ అహ్మద్ మాట్లాడుతూ ఈ నెల 26న శనివారం నాడు రూబీ గార్డెన్‌లో మక్కాకు వెళ్లే 27మంది హజ్ యాత్రికులకు సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ శాసన సభ్యులు డాక్టర్ కూచుకుల్ల రాజేష్‌రెడ్డి రారున్నారని తెలిపారు. డి.ఎం.హెచ్.ఓ మాట్లాడుతూ హజ్ యాత్రికులకు శారీరక ఆరోగ్య పరీక్షలు, రక్త మూత్ర పరీక్షలు నిర్వహించి, వారికి మైనింగో కోకల్ మేన్నిజై టీస్, ఎస్ఐవి, ఓరల్ పోలియో వ్యాక్సిన్‌లను వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీకా అధికారి డాక్టర్ రవికుమార్, జిల్లాహజ్ సొసైటీ సభ్యులు ఇబ్రహీం, మొలాపీరా పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత

**వెల్దండ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ మనఅందరి బాధ్యత అని జై బాపూ–జై భీమ్–జై సంవిధాన్‌లో కాంగ్రెస్ పార్టీమండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్ అన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు మండలంలోని కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపూ– జై భీమ్–జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, నాయకులు పోనుగొంటి రవీందర్ రావు, తక్కల్లపల్లి శేఖర్, శ్రీనివాస్ యాదవ్, పుల్లయ్య,నారాయణ,హరికిషన్‌నాయక్, చంద్రశేఖర్, రమాకాంత్‌రెడ్డి, వెంకటయ్య,రవీందర్, జయపాల్‌రెడ్డి, పసిరుద్దీన్, దస్తగిరి, శివమ్మ, లక్ష్మమ్మ, రమేష్‌తో పాటు తదితరులున్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

**మద్దూర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్న సంఘటన మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరారం గ్రామంలో చోటు చేసుకుంది వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి ఐదు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా మద్దూర్ పోలీస్ సిబ్బంది ట్రాక్టర్లు పట్టుకొని మద్దూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాఘవేందర్, తాళ్ల లక్ష్మణ్, పెద్దపురం కనకప్ప, ఎర్ర పుల్ల చిన్నప్ప, తోళ్ళ లక్ష్మయ్య వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## యూత్ లీడర్స్ కాంక్లేవ్‌లో జడ్చర్ల విద్యార్థుల ప్రతిభ

**జడ్చర్ల, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ దగ్గరలోని ఎర్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన యూత్ లీడర్స్ కాంక్లేవ్ ఫర్ బెటర్ ఎర్త్ (మెరుగైన భూమాతకోసం లీడర్‌ల సమావేశం)లో జడ్చర్ల డా.బి.ఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణ రెడ్డి చేతుల మీదుగా మొదటి బహుమతిని అందుకున్నారు. సుమారుగా 500 మంది హాజరైన ఈ సమావేశంలో భూమిని కాపాడుకుందాం అనే అంశంపై 30 స్టాల్‌లను ఏర్పాటు చేయగా అందులో జడ్చర్ల బిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించింది. ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్ డా. సదాశివయ్య ఆధ్వర్యంలో 12 మంది విద్యార్థులు తెలంగాణ బొటానికల్ గార్డెన్, అనేక రకాల విత్తనాలు, పాముల సంరక్షణ అనే అంశాలపై స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సుకన్య, గార్డెన్ సమన్వయకర్త డా.బి. సదాశివయ్య, ఎన్‌సిసి ఎఎన్ఓ డా. రాజేశ్వరి, పరిశోధక విద్యార్థులు పరమేష్, సురేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ రవీందర్, సాయి,భరత్, శివ, సాయికుమార్, ఇందు, మేఘన, అనసూయ, సాయిరాం, శివసాయి, శ్రీకాంత్, నందులు పాల్గొన్నారు. వీరితో పాటు18మందిఎన్‌సిసికాడేట్‌లుబందోబస్తు కోసం హాజరయ్యారు.

## సిరిసంపదల ఆలయంలో జిల్లా జడ్జి పూజలు

**బిజినేపల్లి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని శ్రీ సిరిసంపదల ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం జిల్లా జడ్జి రాజేష్ బాబు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలస్వామి పూర్ణకుంభంతో జడ్జి దంపతులకు ఆహ్వానం పలికారు.ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ జిల్లా జడ్జిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నెల్లికంటి మహేశ్వర్ రెడ్డి, దుస్స సైదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు పారితోషికం

**ధన్వాడ, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ డిటిఓ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గాజుల ప్రణయ్ వారి తండ్రి గాజుల శివకుమార్ ఎస్‌టిఓ జ్ఞాపకార్థం ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో నిరుపేద విద్యార్థులై చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న వారికి పదివేల రూపాయలను నగదు పారితోషకంగా అందించడం జరిగింది. నగదును పాఠశాలలోని ఐదుగురు నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అందించడం జరిగింది. పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు పదివేల రూపాయలను నగదు పారితోషికంగా చేయూతను అందించిన గాజుల ప్రణయ్‌కు పాఠశాల హెడ్మాస్టర్ ఎం.నరసింహాచారి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫరీదా సుల్తానా, సుభాషిని, అమూల్య, సురేష్‌బాబు, వెంకటేష్, అశోక్ కుమార్, నెల్సన్ శ్రీనివాస్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

